# సానుభూతి

ప్రస్తుతం ప్రపంచాన్ని గడగడలాడిస్తోన్న ఎయిడ్స్ గురించి తరచూ ఏదో ఒక పేపర్లో వార్తలు చదువుతూ ఉంటాం!

వ్యాధి ఏదైనా అది విజృంభించి మానవాళిని కబళించకుండా ఎప్పటికప్పుడు ప్రజల్ని ఎడ్యుకేట్ చేస్తూ తదనుగుణంగా ప్రభుత్వాన్ని స్పందించేలా వార్తలు రాయటం విలేకర్ల తక్షణ కర్తవ్యం!

కాని ఎక్కడో - ఎవరికో ఆ వ్యాధి సోకిందని తెలిసినపుడు ఉరుకులూ, పరుగుల్తో వాటిని సేకరించి - ఆ వ్యాధి పీడితుల పేర్లూ, చిరునామా తాటికాయలంతేసి అక్షరాల్తో పత్రికల్లో ప్రచురించడం చూస్తూ ఉంటాం!

అసలే ఆ వ్యాధి సోకిందని పుట్టెడు దిగులుతో మంచమెక్కిన మనిషికి... ఈ దెబ్బతో గోరుచుట్టుపై రోకటిపోటులా... తోటి వాళ్ళ బహిష్కరణ తోడై - శ్రీశ్రీ చెప్పినట్లు 'నిద్రకి వెలియై - నే నొంటరినై - చీకటిగదిలో నాగులతో'... గడుపుతున్నట్టుగా బ్రతుకు దుర్భరమై - సదరు రోగులు మనఃస్థైర్యాన్ని దెబ్బతీస్తుందన్న సంగతి విలేకరులు దృష్టిలో పెట్టుకోవాలి !

వార్తలు మనిషిలో సానుభూతినీ, కరుణ రసాన్నీ పెంపొందించేవిగా లేకుంటే పోనీగానీ - తోటి మనిషిని చూసి జడుసుకుని... అతణ్ణి ఇంట్లో ఏకాకిని చేసి- ప్రాణ భయంతో పరుగులు తీసేలా ఉండకూడదు!

విందులకీ, వినోదాలకీ - పెళ్ళిళ్ళకీ, ఒకరిళ్ళకి మనం వెళ్ళకున్నా తరిగేదీమీ ఉండదు! కానీ దీర్ఘ రోగాల్తో బాధపడే వాళ్ళకి కనీసం వీలున్నప్పుడైనా సానుభూతిని ప్రకటించి - వారిలో జీవితేచ్ఛ కల్గించకపోతే -

**చనిపోయిన వాళ్ళని స్మశానంలో దహనం చేసే సాంప్రదాయమున్న సమాజంలో...**

**బ్రతికున్న మనిషికి ఇంట్లోనే చితి పెట్టిన రాక్షసులమనిపించుకుంటాం!**

పోతే సానుభూతి అన్నివేళలా అందరి పట్లా ప్రకటిస్తే - అది దుష్ఫలితాలకు దారితీస్తుంది.

ఒంట్లో శక్తిఉండీ - కష్టపడడానికి ఇష్టపడని ముష్టివాడికి... 'దయగల తల్లులు' అడిగినప్పుడల్లా అన్నం పెడ్తూంటే... జీవితాంతం అతడు 'సోమరిపోతు'గానే ఉండిపోవాలనుకుంటాడు!

తన కష్టాలకూ, కన్నీళ్ళకూ మరొకర్ని కారణం చేస్తూ - తన దుస్థితికి వేరొకర్ని నిందిస్తూ... ఒకరి సానుభూతినీ, సాయాన్నీ అర్థించేవాడు ఆజన్మాంతం 'అభిమాన హీనుడు'గానే పేరు పడిపోతాడు!

ఎవరైనా రాజకీయనాయకులు... హత్యలకు గురైనపుడు - సానుభూతి వెల్లువలా ప్రవహించి - ఎంతోమంది అనామకులు... 'తంతే బూర్ల బుట్టలో పడ్డట్లు'గా ఎన్నిక



*Contd...*

కావడం - తమ నియోజకవర్గాలకి ఎంతో సేవచేసిన అభ్యర్థులు... 'నామరూ పాల్లేకుండా కొట్టుకు పోవడం' చూసినప్పుడు సానుభూతి పవనాల ధాటికి ఓటర్ల' 'విచక్షణ' దూదిపింజలా ఎగిరిపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది!

ఎవరైనా రాజకీయ నాయకులు - తమకు జరిగిన అన్యాయాన్ని ప్రజల ముందు ఏకరవు పెడ్తూ బావురుమన్నప్పుడు కొందరికి 'అయ్యో పాపం!' అని గుండె ఆర్ద్రమై - వాళ్ళకోసం ప్రాణాలు సైతం ధారపోయాలన్నంత వీరావేశం కల్గితే- మరికొందరికి అలాంటివన్నీ జనం దృష్టినాకర్షించే ఎత్తుగడలుగా తోచి - అంతకుముందున్న సానుభూతి కూడా హరించుకుపోయి జుగుప్సకల్గుతుంది.

అయితే 'అసలు కన్నీళ్ళకీ - మొసలి కన్నీళ్ళకీ'.... 'వెన్నుపోట్లకీ - తిరుగుబాట్లకీ' తేడా తెలుసుకోకుండా, తాత్కాలిక ఆవేశకావేశాలకి లోనై ఓటు హక్కు వినియోగించుకుంటే - 'చేసుకున్నవాళ్ళకి చేసుకున్నంత మహదేవా' అన్నట్లు - అటు మింగలేకా ఇటు కక్కలేకా సతమతమయ్యే దుస్థితి ఓటర్లకి ఏర్పడుతుంది.

ఏదో ఒక 'ప్రభంజనం'లో గుడ్డిగా కొట్టుకు పోకుండా కాసులకో, మద్యానికో అమ్ముడు పోకుండా - ఓటర్లు తమ 'విచక్షణ'ని ఉపయోగించి - అభ్యర్థుల సామర్థ్యానికీ, మంచితనానికీ విలువ ఇచ్చి గెలిపించినపుడు - పాలితులందరికీ స్వచ్ఛమైన పాలకులు లభిస్తారు !



16-4-1996